రక్తంత్రాగే పిశాచం

వసుంధర

(గత సంచిక తరువాయి)

"అయ్యో—వకుళా—అవన్నీ చూడ్డానికి నేను బ్రతికుండను గదా—" అన్నాడు మధు దీనంగా.

"పాపం—ఏం చేస్తావు—దేనికైనా యోగముండాలి"

అంటూ వకుళ మళ్ళీ మధు భుజంమీదకు వంగింది.

మధు పరవశంగా కళ్ళు మూశాడు.

సరిగ్గా అప్పుడే "మధూ!" అన్న పిలుపు వినబడింది. వకుళ చటుక్కున చెట్టు చాటుకు వెళ్ళిపోయింది. మధు లేచినిలబడ్డాడు. అతడి ముఖం అసంతృప్తిగా ఉంది.

"ఒక్కడివీ ఇక్కడేం చేస్తున్నావురా మధూ!" అంటూ అక్కడికి మధు తల్లి వచ్చింది.

"ఇప్పుడు నువ్విక్కడికెందుకొచ్చావమ్మా?" అన్నాడు మధు విసుగ్గా.

"నిద్ర పట్టలేదు. లేచి నిన్ను పలకరిద్దామంటే నువ్వు మంచంమీద కనబడలేదు. నీ ఉద్యోగం గురించి మీ నాన్నగారు త్తరం రాసినప్పట్నించీ నీ పెళ్ళి గురించే ఆలోచిస్తున్నాను. రేపు పెళ్ళివారికి కబురు పంపిద్దామనుకొంటున్నాను—" అంది మధు తల్లి.

"పెళ్ళివారెవరమ్మా?" అన్నాడు మధు.

"వెంకటేశ్వర్లు కాకినాడ పెళ్ళివారు. పిల్లని చూసుకొందుకు రమ్మని రెండు నెల్లనుంచి చెబుతున్నారు. నేనే వెనక్కి నెట్టేస్తున్నాను. నీ ఉద్యోగం ఖాయమైనట్లే కాబట్టి ఇంక వాళ్ళకేదో కబురు చెప్పాలి—" అంది తల్లి.

"నా పెళ్ళికిప్పుడు తొందరేమొచ్చిందమ్మా" అన్నాడు మధు.

"తొందరంటే తొందరకాదూ — ఒక్కగానొక్క కొడుకువి. నీమీదే ఆశలుంచుకొని బ్రతుకుతున్నాను—" అంటూండగా ఆమె కళ్ళు చెమర్చాయి—"నా అదృష్టం కొద్దీ నువ్వు ఆ మాయదారి వకుళ పాలబడినట్లేపడి బైట పడ్డావు. ఆ దిక్కుమాలిన పిశాచపు ముండ కళ్ళు—

ఇంతమందిలో నీమీదే పడాలా—"

"అమ్మా—" అరిచాడు మధు—"నువ్వు వకుళ నేమీ అనొద్దు. అంటే నాకు కోపం వస్తుంది. నాకోపం వస్తే నేనేం చేస్తానో నాకే తెలియదు."

ఆమె ఆశ్చర్యంగా మధువంక చూసి—"అదేంటిరా అలా మాట్లాడతావ్? ఆ మహానుభావుడెవరో దయ తలచి కుంకం యివ్వకపోతే, నీకు తాయెత్తు కట్టకపోతే ఈపాటికి ఆ ముండ నిన్ను పీకుచుకు తినేసేది—" అంది.

"అమ్మా-" అన్నాడు మధు కోపంగా-"వకుళ నేమీ అనొద్దు. ఆమెను నేను ప్రేమిస్తున్నాను—"

"పిశాచాన్ని ప్రేమిస్తున్నావా? నీకేం పిచ్చిపట్ట లేదుగదా—అసలు దాని బుద్ధులొక్కటీ మంచివి కాక పోవడంవల్లనే భగవంతుడు చచ్చేక్కూడా దానికి పిశాచి రూపునిచ్చాడు—" అంది మధు తల్లి.

మధు ఒక్కడుగు ముందుకువేసి—తల్లిని సాచి లెంప కాయ కొట్టాడు.

మధు తల్లికి కళ్ళు బైర్లు కమ్మాయి. కాసేపు ఆమెకు నోటమాట రాలేదు. నెమ్మదిగా తేరుకొని — "ఎంత దెబ్బ కొట్టావురా అప్రాచ్యుడా! కన్న తల్లికంటే నీకా పిశాచమంటే ఎక్కువట్రా—" అంటూ మధువైపుచూసి ఆగిపోయిందామె.

అప్పుడు మధు ఎప్పటి మధులాలేడు. కళ్ళు ఎర్ర బడ్డాయి. ముఖం క్రూరంగావుంది. అతడిప్పుడు మనిషిలా కాక పిశాచంలా ఉన్నాడు. తల్లి ఆ మూపుల్నీ ఆకారాన్నీ చూసి భయపడుతూ—"ఏమయిందిరా నీకు? ఆ పిశాచం ముండకానీ మళ్ళీ నిన్నావహించలేదుగదా"

అంటూ యింట్లోకి పరుగెత్తింది. అప్పుడే ఆమెకు కుంకం విషయం గుర్తుకొచ్చింది.

మధును పిశాచం ఆవహించిందనడంలో సందేహం లేదు. ఆ పిశాచాన్ని వదల్చడానికి బైరాగి ఇచ్చిన కుంకం తప్ప మరో దారిలేదు. మధు తనమీద పడేలోగా తనా కుంకం తీసుకురావాలి.

"మధూ—వెళ్ళు.... ఆమెని చంపేసేయ్. నన్నింతలా తిట్టినందుకు ఆమెకదే శిక్ష...." అంది వకుళ చెట్టు వెనకనుంచి. చెవిలో గుసగుసలాడినట్లుగా మధుకా మాటలు వినిపించాయి.

అతడు ఒక్కసారిగా అక్కణ్ణించి తల్లివైపు ఉరికాడు.

కొద్దిక్షణాల్లోనే కెవ్వుమన్న ఆర్తనాదం వినబడింది.

వకుళ సంతృప్తిగా తలాడించి—"ఇంక రతన్‌లాల్ సంగతి చూడాలి!" అనుకొంది.

33

ఒకే రాత్రిలో జరిగిన మూడు హత్యలు—కోదండం, రతన్‌లాల్, మధు తల్లి—నగరాన్ని అట్టుడికించాయి.

రతన్‌లాల్ శరీరంలోంచి రక్తం పూర్తిగా పోయింది. ఒంటిమీద గాయం ఎక్కడా లేదు.

కోదండం తల చేత్తో పట్టుకొని మొండెంగా నిలబడ్డాడు.

మధు తల్లి గొంతు పిసికి చంపబడింది.

తన తల్లిని తనే చంపినట్లు మధు ఒప్పుకున్నాడు. కానీ వకుళ పేరు చెప్పలేదు. చనిపోయిన తన ప్రియురాలిని తిట్టిందన్న ఆవేశంతో తను హత్య చేసినట్లు అతను చెప్పాడు. పోలీసులతన్ని కస్టడీలోకి తీసుకున్నారు.

తల్లిని చంపానన్న బాధకానీ, దిగులుకానీ ముఖంలో కనబడకపోవడం చాలామందికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

కోదండం హత్య ఎలా జరిగిందో యెవరికీ తెలియదు. రతన్‌లాల్ విషయం చెప్పనే అవసరంలేదు.

"లింగం—వకుళ విజృంభించింది—" అన్నాడు మహాదేవుడు.

"కానీ ఆమె ఉనికి తెలియకుండా ఉంది—" అన్నాడు లింగం.

"నిస్సందేహంగా ఆమెకు వినోద్ రక్షణ లభించింది. మనం ఎలాగో అలా వకుళను పట్టాలి—" అన్నాడు మహాదేవుడు.

"ఎలా పట్టుకొంటాం? ఏ యింటనైతే ఆమె ఆటలు కట్టించిన కుంకుమ ఉన్నదో ఆ యింటి మనిషినే ఆమె హత్య చేయించింది. అంటే ఆమె ఏవేవో కొత్త శక్తులు సంపాదించిందనుకోవాలి-అలాంటి మనిషిని మనం పట్టుకోగలమా అని?" అన్నాడు లింగం.

"నేను అంజనేయ చక్రాన్ని అభ్యసించాను. ఇంక వకుళను పట్టుకోవడం కష్టంకాదు—" అన్నాడు శివశంకరం.

"అంజనేయి దండకం వినోద్ మీద పనిచెయ్యలేదు. వకుళమీద మాత్రమేం పనిచేస్తుంది?" అన్నాడు మహాదేవుడు.

"అసలు వినోద్ ప్రవర్తన విచిత్రంగావుంది. దండకం ప్రారంభించగానే అతడు బాధను నటించాడు. అది నిజమేననుకొన్నాం. కానీ తర్వాత దండకం చదువు

తూంటే నవ్వడం మొదలుపెట్టాడు. అసలు దండకం వింటే తనకు బాధకలిగినట్లు నటించాలని అతడికెలా స్ఫురించింది? వకుళ వినోద్ రక్తం తాగిందో లేదో తెలియదు. దాన్నిబట్టే కదా దండకం అతడిమీద పని చేసేదీ లేనిదీ తెలుస్తుంది. కానీ అతడికి వకుళ గురించి ఎంతో కొంత సమాచారం తెలుసునన్నమాట నిజం. అందువల్ల మనమతడి యింటిని శోధించాలి—" అన్నాడు లింగం.

అదెలాగా అన్న విషయం ముగ్గురూ చర్చించగా అందుకు లింగమే సమర్థుడని తేల్చారు. అతడు యువకుడు. అందంగా ఉంటాడు. ఎలాగో అలాగున ఏదోవిధంగా అతడు జలజతో స్నేహం సంపాదించాలి. వినోద్ చెల్లెలు జలజకు అన్నయ్యచేసే వ్యవహారాలు నచ్చుతున్నట్లులేదు. వకుళ అంటే ఆమెకు సానుభూతి ఉన్నట్లు కూడా లేదు. వకుళను సాధించాలంటే ఆమె పరిచయం అవసరం.

మహాదేవుడికి మరో దారి కనిపించలేదు. దుష్టశక్తి కథనాన్ని జనం నమ్మినా నమ్మకపోయినా ఆ విషయమై పోలీసుల సహకారం మాత్రం లభించదు. దుష్టశక్తిని సృష్టించింది తామే కాబట్టి—దాని అంతు తేల్చవల్సిన బాధ్యత కూడా తమపైన ఉన్నది.

ఆ ప్రకారం లింగం బయల్దేరాడు. అతడు ఒక రోజంతా వినోద్ ఇంటిని మాటువేశాడు. జలజ ఇంట్లో నుండి బయటకు రాలేదు. బయటనుంచి ఇంట్లోకి పోలేదు. మర్నాడుదయం పదిగంటలకు అతడి నిరీక్ష ఫలించింది.

జలజ ఇంట్లోనుంచి బైటకు వస్తోంది. తమ యింటికి వచ్చిన రోజున ఆమె ఎంతో అమాయకంగా కనబడింది.

ఈ రోజున ఆమె వెన్నెల విసనకఱ్ఱలా ఉంది.

"హలో—గుర్తున్నానా!" అంటూ ఆమెను పలకరించాడు లింగం.

"హాయ్—" అంది జలజ. ఆమె కళ్ళు చూస్తూంటే ఆమె అతన్ని గుర్తుపట్టినట్లులేదు.

"నా పేరు లింగం. ప్రొఫెసర్ మహాదేవుడు అసిస్టెంటుని. ఒకరోజు మీరు మా యింటికొచ్చి వనజ గురించి ఏమో చెప్పబోయారు. మీ అన్నయ్య వినోద్ అడ్డుపడ్డాడు. దాంతో మనం విడిపోయాం. అప్పట్నించీ మిమ్మల్ని కలుసుకోవాలని ప్రయత్నిస్తున్నాను. సాధ్య పడడంలేదు—" అన్నాడు లింగం.

"వెరీగుడ్—గ్లాడ్ టూ మీట్యూ—" అంటూ చేయి జాపింది జలజ. లింగం సందేహించకుండా తనూ చేయి జాపి షేక్‌హాండిచ్చాడు. ఆ స్పర్శకు అతడి తనువు పులకరించింది.

"మిమ్మల్ని చూడగానే మీతో పరిచయం చేసుకోవాలనిపించింది. ఎనీ అబ్జక్షన్!" అన్నాడు లింగం.

"నాకేం అబ్జక్షన్ లేదు — ఎటొచ్చీ మీరు మీరు అంటూ మన్నించుకుంటూ స్నేహితులమని చెప్పుకోవడం నాకు నచ్చదు. ఎనీ అబ్జక్షన్—" అంది జలజ.

"ఓ.కే. జలజా — మనమిప్పుడు కాసేపు కూర్చుని ఏకాంతంగా కబుర్లు చెప్పుకుందాం—ఎక్కడికి పోదాం?"

"దగ్గర్లో పార్కెక్కడుంటే అక్కడికి—" అంది జలజ.

దగ్గర్లో పార్కులెక్కడున్నాయో లింగానికి తెలియదు. అందుకని జలజే అతడికి దారి చూపించింది.

ఇద్దరూ పార్కు గేటు దగ్గరకు రాగానే లింగం

ఉలిక్కిపడ్డాడు.

కుక్క ఒకటి అక్కడ పడుకొని వుంది. వీళ్ళిద్దరూ అక్కడకు రాగానే అది భయంకరంగా మొరిగింది. కుక్క అలా మొరగడం అతనెన్నడూ వినలేదు. బహుశా ప్రాణాలు పోయేముందు జంతువులలా అరుస్తాయేమో!

ఆ కుక్క చటుక్కున దూరంగా పారిపోయి ఆగి వీళ్ళవంకే చూస్తూ మొరగసాగింది.

లింగం ఆశ్చర్యపడ్డాడు. కుక్క అలా ఎందుకు చేసింది? జలజ కూడా కుకుళకు వశమైపోయిందా?

పిశాచాలనీ, వారి అనుచరులనీ కుక్కలు గుర్తు పడతాయని అంటారు. జలజలో ఆ కుక్క ఏం చూసింది?

లింగం మనసు జలజపట్ల బాధ, జాలితో నిండి పోయింది. ఎంతో అందమైన ఈ యువతి ఇప్పుడు ఒక పిశాచానికి బానిస. ఆ పిశాచం కోసం ఆమె ఇప్పుడు ఎంతటి కిరాతకమైనా చేయగలదు!

అలాంటి ఆమెతో తానిప్పుడు పార్కులోకి వెడుతున్నాడు. ఏకాంతంలో ఆమె తనకేమైనా చేస్తే? అసలే—తానిప్పుడు కుకుళకు వ్యతిరేకంగా సమాచారం సేకరించాలనుకొంటున్నాడు. అందువల్ల జలజ ద్వారా కుకుళ తనను హింసిస్తే—?!

ముందడుగు వేయడానికి తటపటాయించాడు లింగం.

“కుక్క అరుపుకు జడుసుకున్నట్లున్నావ్—” అంది జలజ.

తియ్యటి ఆ కంఠస్వరం లింగం మనసులోకి ఏదో మత్తు నావహింపజేసింది.

“పద — పోదాం—” అంటూ ముందడుగు వేశాడు లింగం. ఇద్దరూ పార్కులో ఓ పొద చాటున కూర్చు

న్నారు.

జలజ లింగం చేతిని తన చేతిలోకి తీసుకొని—"నీ శరీరం స్త్రీలకన్నా కోమలమైనది—" అంది.

"అయినా నీ చేతిపక్కన అది మోటుగా వున్నది-"

జలజ లింగం అరచేతిని తన నోటివరకూ తీసుకొని మృదువుగా చుంబించి — "చక్కటి రక్తపు వాసన!" అంది.

లింగం కంగారుగా — "ఏమన్నావ్?" అన్నాడు. అయితే ఆమె పెదవులస్పర్శ అతడికెంతో హాయిగా వున్నది.

జలజ అతడి చేతిని వదిలి — "ఏమీ లేదు. ఇంతకీ నానుంచి ఏమాశిస్తున్నావ్ చెప్పు—" అంది.

"నువ్వు వకుళను ఎప్పుడు ఎలా చూశావో చెప్పు—" అన్నాడు లింగం.

"అదా నీకు కావలసింది—" అని నవ్వింది జలజ. ఆ నవ్వు నెమ్మదిగా, భయంకరంగా వుంది. అలాంటి నవ్వు లింగం ఎన్నడూ వినలేదు.

"అదేం నవ్వు?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అలా నువ్వు నవ్వగలవా?" అనడిగింది జలజ.

"నవ్వలేను. నవ్వగలిగినా అలా నవ్వడం నాకిష్టముండదు—" అన్నాడు లింగం.

"వకుళ అలాగే నవ్వుతుంది. ఇంకోలా నవ్వడం ఆమెకు రాదు—" అంటూ మళ్ళీ నవ్వింది జలజ. ఆ నవ్వు కూడా మళ్ళీ ఇందాకటిలాగే భయంకరంగా, నెమ్మదిగా వున్నది.

"వకుళ నవ్వితే నవ్వింది. కానీ నువ్విలా నవ్వొద్దు—" ఆ నవ్వు వింటూంటే అతడి శరీరంలో భయోత్పాత

మవుతోంది.

"వకుళ నవ్వు గురించి చెబితేనే భయపడుతున్నావు. మరి వకుళ గురించి ఇంకేం చెప్పను?" అంది జలజ.

"చెప్పు—ఫరవాలేదు—" అన్నాడు లింగం.

"వకుళ ప్రతిరోజూ మా ఇంటి గదిలో స్నానం చేస్తుంది. ఎలాగో తెలుసా? గదిలో నిలువెత్తు గాజు తొట్టె వుంటుంది. దాంట్లో శవాలను నిలవుంచే ద్రావక ముంటుంది. వకుళ ఆ గదిలోకి వెళ్ళి గాలిలోకి ఎగురు తుంది. అక్కణ్ణించే బట్టలు విడిచేస్తుంది. సరాసరి ఆ తొట్టెలోనికి దుముకుతుంది. ఇష్టంవచ్చినంత సేపు అందులో జలకాలాడుతుంది. వకుళ అనుచరులు తప్ప మరెవ్వరు చూసినా ఆ దృశ్యానికి జడుసుకుంటారు—" అంది జలజ.

"నువ్వు వకుళ అనుచరురాలివా?" అన్నాడు లింగం.

"నేను కాదు. మా అన్నయ్య. ఒకసారి నేను వకుళను స్నానమాడుతూండగా చూసి జడుసుకొని పరుగున మీ ఇంటికి వచ్చి విషయం చెప్పబోతే అన్నయ్య అడ్డుకున్నాడు గదా-వకుళ అనుచరుడు కాబట్టే వాడా పనిచేశాడు—" అంది జలజ.

"వకుళకి ఊళ్ళో ఇంకా చాలామంది అనుచరు లున్నారా?"

"అనుచరులూ వున్నారు. యజమానురాలూ వుంది-"

"యజమానురాలా?" అన్నాడు లింగం ఆశ్చర్యంగా.

"అవును. రాగిణి ఆమె పేరు—" అంది జలజ.

"రాగిణి వకుళకు యజమానురాలా? అదెలా సాధ్యం?" ఆశ్చర్యంగా అన్నాడు లింగం.

"వకుళకు రక్తపానం ఇష్టం. మనుషుల్నేడిపించడం

ఇష్టం. ఈ పనులు స్వయంగా చేయడంకంటె ఒక యజమాని ఆజ్ఞలకు లోబడి చేయడం ఆమెకింకా ఇష్టం. ఆమె ఎవరి రక్తం తాగిందో-వారి రక్తాన్ని మరో మనిషి తాగడం సంభవిస్తే — వకుళ ఆ మనిషిని యజమానిగా అంగీకరిస్తుంది. వకుళ ఎవరి రక్తం తాగితే వారామెకు అనుచరులవుతారు. అలాగే నా అన్నయ్య ఆమెకు అనుచరుడయ్యాడు. ఓ రోజు పెన్సిలు చెక్కుతుండగా బ్లేడు తగిలి అన్నయ్య చెయ్యి తెగింది. అప్పుడు పక్కన రాగిణి వుంది. రక్తం కారుతున్న వేలును రాగిణి చటుక్కున నోట్లో పెట్టుకు చప్పరించింది. అంతే—.... కొద్ది క్షణాల్లో అక్కడికి వకుళ వచ్చి రాగిణికి సలాం చేసింది. అల్లావుద్దీన్ అద్భుత దీపం కథ వినలేదూ—అలాగన్నమాట!" జలజ ఆగింది.

లింగం ఆలోచిస్తున్నాడు. ఇదంతా తమాషాగా వుంది. ఇంట్లో తాము చర్చించిన విధంగానే జరుగుతోంది వ్యవహారమంతా! అంటే వకుళ ఇప్పుడు రాగిణి వశమైందన్నమాట! అంటే రాగిణి వకుళ నుపయోగించి-సేవా కార్యక్రమాలు ప్రారంభించింది. ఒకవిధంగా చెప్పాలంటే రాగిణి చాలా తెలివైనది. వినోద్ వద్ద ఆమెకు చనువెక్కువో, లేక అసలు రహస్యం ఆమెకు తెలుసో — కానీ ఓ దుష్టశక్తిని ఆమె వశపర్చుకొని ప్రజోపయోగకర కార్యాలు చేయగల్గుతోందామె. కానీ ఇలా ఎంతకాలం కుదురుతుంది? వకుళనామె ఎంత కాలమని అదుపులో వుంచగలదు?

"నీ ఆలోచనలు నాకు తెలుస్తున్నాయి—" అంటూ జలజ నవ్వింది. అదే నవ్వు....గుండెలదరగొట్టే నవ్వు....

"వకుళ తన యజమానిని తనే ఎన్నుకోగలదు. రాగిణి

ఆమెకు నచ్చింది. అందుకే ఆమెలో రక్తపాన ప్రేరణ కలిగించింది. రాగిణితో ఆమె విసిగిపోతే మరో యజమానిని వెతుక్కుంటుంది. కొత్త యజమాని పాత యజమానిని చంపగలడు—"

లింగం ఆలోచనలు పరిపరివిధాల పోయాయి. రాగిణి మంచిది. ఆమె వకుళను మంచి పనులకుపయోగిస్తోంది. కానీ వకుళ ఎన్నుకొన్న మరో యజమాని దుష్టుడైతే.... అప్పుడు పరిణామాలెలా వుంటాయి?

"నువ్వు వకుళను గురించి చాలా విశేషాలు తెలుసుకో గలిగావు. ఇన్ని వివరాలెలా వచ్చాయి నీకు?"

"అంతా రాగిణి చెప్పింది. అవన్నీ విన్నాకనే వకుళ అంటే భయం పోయింది. నిజం చెప్పాలంటే వకుళ గురించి సత్ప్రచారం చేయాలని కూడా వుంది నాకు. నువ్వు వింటానంటే వకుళ చేసే మంచి పనులన్నీ ఏకరువు పెడతాను—"

"వద్దులే—కాసేపు ప్రేమ కబుర్లు చెప్పుకుందాం—" అన్నాడు లింగం.

"కబుర్లలో ప్రేమ ఏమిటి?" అంటూ దగ్గరగా జరిగింది జలజ.

లింగం వళ్ళు వెచ్చబడింది. జలజ తన రెండు చేతులూ అతడి చుట్టూ పెనవేసింది. కౌగిలి బిగుసుకుంటోంది. ఆ కౌగిలి వెచ్చగాలేదు. ఇరుకుగా, బిగుతుగా వుంది. క్రమంగా ఊపిరిసలపని విధంగా వుంది.

"వదులు. ఇదేం కౌగిలి. ఇంత బలమేమిటి నీకు?" అంటూ కేకలు పెట్టాడు లింగం. ఏమనుకుందో ఆమె అతణ్ని వదిలేసింది.

లింగం ఆయాసపడుతూ ఆమెవంక అదోలా చూస్తూ-

ఆమెకు కాస్త దూరంగా జరిగి—

"సందేహంలేదు. నువ్వు వకుళ అనుచరురాలివే—నీ కౌగిలికి నేను వచ్చానని అనుకున్నాను—" అన్నాడు,

"వకుళ నా రక్తం తాగలేదు. కానీ మరోవిధంగా నేనామె అనుచరురాలినే-ఇంకా చెప్పాలంటే నేనామె భక్తురాలిని. అందువల్ల ఆమె నాకు కొంత బలాన్ని ఇచ్చిందేమో—" అని నవ్వింది జలజ. అదే నవ్వు ... గుండెలు తోడేసే నవ్వు....

"సరే—అయితే ఈ వేళ్టికి సమావేశం చాలు. మనం మళ్ళీ కలుద్దాం—" అంటూ లేచాడు లింగం.

"అప్పుడే వెళ్ళిపోతానంటే ఎలా?" అంటూ చేయి పట్టుకొని లాగిందతణ్ణి జలజ. లింగం ఎలాగో తమాయించుకొని ఆమె పట్టు వదలగానే అక్కణ్ణించి పరుగు లంకించుకున్నాడు. ఊహించని ఈ పరిణామానికి జలజ అక్కణ్ణించి లేచి అతణ్ణి తరిమింది. అలా రోడ్డుదాకా వచ్చారు. లింగం పరుగు ఆపలేదు. జలజ అక్కడే ఆగిపోయి అదేపనిగా నవ్వసాగింది.

జనం ఆమెచుట్టూ మూగారు. వాళ్ళనామె గమనించలేదు. జనంలోంచి ఓ మనిషి ముందుకు వచ్చి—"కాస్త నీ నవ్వునాపు తల్లీ — ఇదేమైనా నాటికలో దెయ్యం వేషమనుకున్నావా?" అన్నాడు.

జలజ చటుక్కున నవ్వునాపి చుట్టూ చూసి—"ఈ నవ్వు విని నా ప్రియుడు జడుసుకొని పారిపోయాడు. ఆడాళ్ళు మగాళ్ళని భయపెట్టడం మీరెప్పుడైనా విన్నారా?" అనడిగింది.

ఈలోగా లింగం పరుగుపరుగున ఇల్లు చేరాడు. ఆయాసం తగ్గగానే జరిగిన జథ చెప్పాడు. అది విని మహా

దేవుడు, శివశంకరం ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

"రాగిణిని మనం మెచ్చుకోవాలి. వకుళవంటి దుష్ట శక్తిని ఆమె చక్కగా వుపయోగించుకుంటున్నది. మన దేశంలో నవసమాజం ఏర్పడాలంటే దుష్ట శక్తులు పని చేయక తప్పదు. సామాన్య పద్ధతుల్లో ఇక్కడి అన్యాయాలనణచడం కష్టం—" అన్నాడు మహాదేవుడు.

"రాగిణికి సంబంధించినంతవరకూ ఫరవాలేదు. కానీ ఆ తర్వాత వకుళ ఏ స్మగ్లర్ కో లోబడితే?" అన్నాడు శివశంకరం.

"కాస్త మీ చర్చను ఆపి జలజను గురించి ఏం చేయాలో ఆలోచించండి. ఆమెతో నా సమావేశాన్ని తలచుకుంటుంటే నా గుండె లవిసిపోతున్నాయి—" అన్నాడు లింగం.

"అవును. వాటంచూస్తే జలజ వకుళకు లోబడినట్లున్నది. ఆమెను మళ్ళీ మామూలు మనిషిని చేయాలి-" అన్నాడు మహాదేవుడు.

"నా బాధ అది కాదు. మళ్ళీ ఆ జలజ దగ్గరకు వెడితే ఏం చేస్తుందోనని హడిలిచస్తున్నాను. ఆ వకుళ శక్తుల బారినుండి తప్పించుకోవడానికి వేరే మార్గంలేదా?" అన్నాడు లింగం.

"అంటే?" అన్నాడు శివశంకరం.

"ఏదైనా రక్షా కవచంలాంటిది ...." అన్నాడు లింగం.

మహాదేవుడు తల పట్టుకుని — "ఇన్నేళ్ళ సైన్సు ప్రయోగాల తర్వాత నా అసిస్టెంటుకు రక్షక కవచం తయారుచేయడం గురించి ఆలోచించాల్సిన అగత్యం పట్టింది. సైన్సు ఓడిపోయింది—" అన్నాడు.

శివశంకరం చిరాగ్గా తమ్ముడివంక చూసి — "ఈ సృష్టి రహస్యాలను అర్థం చేసుకునేందుకు చేసే నిరంతర ప్రయత్నమే సైన్సు. దానికి ఓటమి వుండదు. మనమిప్పుడు త్వరగా ఆ జలజను పట్టుకుని ఆమె ద్వారా వకుళను సాధించాలి. అందుకు రక్షా కవచాలు తయారుచేయాలి. సైన్సు గురించి తర్వాత ఆలోచించవచ్చు—" అన్నాడు.

"అయితే రక్షా కవచాలు నీవు చేయగలవా?" అన్నాడు మహదేవుడు.

"సదానందుడి శక్త్యోపాఖ్యానం మనకన్ని విధాలా బాగా వుపయోగపడుతోంది. అదే లేకపోతే మనమసలు వకుళ గురించి తెలుసుకోగలిగి వుండేవాళ్ళమే కాము. అందులో రక్షా కవచాల గురించి వుంది. రక్షా కవచం ఆమెబారినుండి మనను రక్షించుకోవడానికి మాత్రమే ఉపయోగిస్తుంది. మనం ఆమెనేమీ చేయలేము...." అన్నాడు శివశంకరం.

శివశంకరం అనుజ్ఞ మేరకు లింగం అప్పటికప్పుడు మూడు రుద్రాక్షమాలలు తీసుకువచ్చాడు. వాటిలోకి మూడు లాకెట్లు అమర్చారు. శివశంకరం చిన్న డ్రాయింగ్ పేపర్ పై ఆంజనేయుడి బొమ్మ గీశాడు. ఆ బొమ్మలు లాకెట్లోకి ఇమిడిపోయాయి. బొమ్మ వెనుక మూడేసి తులసిదళాలు వుంచాడు. ఆ విధంగా మొత్తం మూడు రుద్రాక్షమాలా లాకెట్సు తయారయ్యాయి.

"ఇవే మనకు రక్షా కవచాలు. తులసిదళాలు ఎండిపోగానే మనం మారుస్తూ వుండాలి. ఈ ఆంజనేయ రూపాన్ని చూపి వకుళను బెదిరించాలి. ఇంక మనం బయల్దేరవచ్చు—" అన్నాడు శివశంకరం.

"ముగ్గురం కలిసి వెడతామా-విడివిడిగా వెడతామా?"

అన్నాడు లింగం.

"వకుళవంటి దుష్టశక్తిని ఎదిరించడానికి మనం ఓ మంచి ముహూర్తం ఎన్నుకోవడం మంచిది-" అన్నాడు శివశంకరం.

"అన్నట్లు ఈ రోజు అమావాస్య. రాత్రి పన్నెండు గంటలకు బయల్దేరితే మంచిది—" అన్నాడు మహాదేవుడు.

"అలా వద్దు—ఇప్పుడే బయల్దేరి ఆమె ఆనుపానులు తెలుసుకొని రాత్రికి ఏంచేయాలో నిర్ణయించుకోవడం మంచిదని నా అభిప్రాయం—" అన్నాడు లింగం.

అంతా అదే మంచిదనుకున్నారు. అయితే ముందుగా లింగం వెళ్ళి ఆమెను కలుసుకోవాలనీ అతణ్ని దూరాన్నుంచి తాము కనిపెడుతూ అనుసరిస్తూంటామనీ మహాదేవుడు, శివశంకరం అన్నారు.

లింగం ఆటో ఒకటి కుదుర్చుకున్నాడు. మహాదేవుడు, శివశంకరం అతణ్ని కార్లో అనుసరిస్తున్నారు.

లింగం ముందు జలజ యింటికి వెళ్ళాడు. అక్కడ ఆమె లేదని తెలిసింది. తర్వాత రాగిణి ఇంటికి వెళ్ళాడు. అక్కడ ఉన్నదామె.

"పారిపోయి మళ్ళీ వచ్చావా?" అంది జలజ లింగాన్ని చూసి.

"నీ అందం అలాంటిది. నీతో చాలా మాట్లాడాలి. వస్తావా?" అన్నాడు లింగం.

జలజ లింగంతో బయల్దేరేముందు రాగిణితో—"ఆ కార్యక్రమం ఈ రోజు ముగించబడిందంటే — ఇంక పూర్తిగా నీ పనులమీదే దృష్టి కేంద్రీకరించవచ్చు—" అంది.

"సరే—ముందు నీ స్నేహితుడి సంగతి చూసుకో—" అంది రాగిణి.

లింగం, జలజ రోడ్డుమీదకు వచ్చారు. అక్కడ ఆటో వుంది.

"మనకోసం ఆటో తెచ్చాను. ఏదైనా హోటల్‌కు వెడదామా?" అన్నాడు లింగం.

"నువ్వెక్కడికంటే అక్కడికే—" అంది జలజ.

లింగం ఆటో ఎక్కాడు. జలజ తనూ ఆటో ఎక్కపోయి—"పెళ్ళికాని ఆడపిల్ల పరాయి మగాడి పక్కనే ఆటోలో ఎలా కూర్చుంటుంది? వూరిలో గౌరవం మంట కలిసిపోతుంది. నేను ఆటో ఎక్కను. మనం నడిచే పోదాం—" అంది.

"నాతో హోటల్‌కు రావడానికి సిధపడ్డావు. ఆటో ఎక్కనంటున్నావు. నీ ప్రవర్తన చిత్రంగా వుంది—" అన్నాడు లింగం.

జలజ అతడివంక తీవ్రంగా చూసి—"హోటల్ కంటే గది తీసుకుందామనుకుంటున్నావా? అలాగైతే నేను రాను—" అంది. లింగం ఆటో దిగి—"నేను ఆంజనేయుడి భక్తుడ్ని. బ్రహ్మచర్యం నా వ్రతదీక్ష. నావల్ల నీకేం భయంలేదు—" అన్నాడు. ఆటో వెళ్ళిపోయింది.

"ఆ సంగతి నాకు తెలుసు. అందుకేగా నేను కాగలించుకోగానే పరుగుపెట్టావు—" అంది జలజ నవ్వుతూ. ఆ నవ్వు ఎప్పటిలాగానే వుంది. ఇంత అందమైన యువతికీ నవ్వు ఏమిటో—అనుకున్నాడు లింగం.

"అయితే హోటల్‌కు వెడుతున్నామా?" అన్నాడు లింగం.

"హోటల్‌కు వెడతాం — కానీ హోటల్ రూంకు

కాదు—" అంది జలజ.

ఇద్దరూ దగ్గర్లోని పద్మజా హోటల్‌కు వెళ్లారు. అక్కడ రెండేసి సీట్లు మాత్రమే వున్న ఫామిలీ అపార్టుమెంట్సున్నాయి. ఇద్దరూ ఒకదాంట్లోకి వెళ్ళి ఎదురెదురుగా కూర్చున్నారు. సర్వర్ వచ్చాడు.

"ఏం ఆర్డరిద్దాం?" అన్నాడు లింగం.

"అన్నింట్లోకీ ఏది బాగా ఆలస్యమవుతుంది?" అనడిగింది జలజ సర్వర్ని.

"మిక్స్చర్ ఊతప్పం—" అన్నాడు సర్వర్.

"అవే — రెండు చెప్పు—" అంది జలజ. సర్వర్ వెళ్ళిపోయాడు. అప్పుడామె లింగంవంక చూసి — "అసలు నీతో రూమ్‌కైనా వచ్చేదాన్నే—ఆటోలో నీ పక్కనైనా కూర్చునేదాన్నే—కానీ అలా చేయలేను. ఎందుకో తెలుసా?" అనడిగింది.

"తెలియదు—" అన్నాడు లింగం.

"మెడలో రుద్రాక్ష మాలలు వేసుకునేవాళ్ళంటే నాకు చాలా అసహ్యం—" అంది జలజ.

"అసహ్యంకాదు. భయం!" అన్నాడు లింగం.

"నాకా, భయమా?" అంది జలజ నిర్లక్ష్యంగా.

"అవును—భయమే — నువ్వు వకుళకు ఏజంటువు కదా!" అన్నాడు లింగం.

"నేను ఏజంటును కాదు. అభిమానిని—" అంది జలజ.

"అంతమాత్రాన నీకంత భయమెందుకు?" అంటూ పక్కకు చూసిన లింగం ప్రాన్పడిపోయాడు.

అక్కడ ఎపార్టుమెంట్ గోడకు అద్దమున్నది. ఆ ఆ అద్దంలో తామిద్దరి ప్రతిబింబాలూ స్పష్టంగా కనబడు

తున్నాయి. కానీ అద్దంలోని జలజ ప్రతిబింబం జలజది కాదు. ఆ ప్రతిబింబం కళ్ళు తెరిచివున్నాయి. కానీ రెప్పలు పడడం లేదు. నోరు తెరిచివుందికానీ ఏదో తినడానికి తెరిచినట్లులేదు. శవం నోరు తెరచినట్లున్నది. తన కెదురుగా కుర్చీలో ఓ శవం కూర్చున్నట్లున్నది. ఎవరో ఊపుతూంటే శవం కదులుతున్నట్లుగా ఉంది తప్పితే మనిషి చరిస్తున్నట్లులేదు.

ఆ శవాన్ని కూడా లింగం గుర్తుపట్టాడు. అది వకుళది!

లింగం నరనరాల్లోకీ విద్యుత్తు ప్రవహించినట్లయింది. ఆ శవానికే తను ఇంజక్షన్ చేసి అందులో చలనం సృష్టించి చరిత్రాత్మకమైన ప్రయోగం చేశాడు. అప్పుడు మాయమయిన శవం ఎన్నో తమాషాలు చేసి ఆఖరికి ఇప్పుడు తన కళ్ళబడింది. దీనికోసమే తను వెతుకు తున్నాడు.

తన ఎదురుగా కూర్చున్న జలజ జలజ కాదు. ఆమె రూపంలో తన్ను మోసం చేస్తున్న వకుళ!

లింగం చటుక్కున లేచాడు.

“ఏమయింది?” అనడిగింది జలజ.

“నన్నసహ్యించుకునే ఆడదానితో కలిసి టిఫిన్ చేయను నేను. టాటా—” అన్నాడు లింగం.

“సరే—అయితే వెళ్ళు. రెండూతప్పాలూ నేనే తినేస్తాను—” అంది జలజ.

లింగం బయటకు వచ్చాడు. హోటల్ ఎంట్రెన్స్ దగ్గర కూర్చుని వున్న మహాదేవుడు, శివశంకరం అతడి కళ్ళబడ్డారు. అతడు వారిని సమీపించి — “గొప్ప రహస్యం తెలుసుకున్నాను. వకుళ జలజ రూపంలో

తిరుగుతోంది—" అంటూ తను చూసింది చెప్పాడు.

"సదానందుడు దుష్టశక్తి గురించి రాసినది అక్షరాల నిజం. అద్దంలో దాని అసలు రూపం కనబడుతూంది. అయితే మనకిప్పుడు చాలా రహస్యాలు తెలిశాయి. ఇన్నాళ్ళకు వకుళ ఉనికి తెలిసింది. ఇంక ఆంజనేయ చక్రం ప్రయోగించి ఆమెను బంధించాలి—" అన్నాడు శివశంకరం.

"అయితే ఇప్పుడేం చేద్దాం—" అన్నాడు లింగం.

"ముగ్గురం ఆమె వెంటబడదాం. ఆంజనేయ దండకం ప్రారంభిద్దాం—" అన్నాడు శివశంకరం.

"రోడ్డుమీద ఓ అమ్మాయి వెంటబడి ఆంజనేయ దండకం చదివామంటే జనం ఆంజనేయుడిగా మారి మనల్ని పిశాచాల్ని బాదినట్టు బాదుతారు—" అన్నాడు లింగం.

శివశంకరం నవ్వి — "నేనంత తెలివితక్కువవాణ్ని కాదు. నా వద్ద పాకెట్ టేపురికార్డరున్నది. అందులో ఆంజనేయ దండకం టేపు వున్నది—" అన్నాడు.

వాళ్ళక్కడ పావుగంటసేపు ఎదురు చూశారు. చివరికి జలజ బైటకు వచ్చింది. లింగం ఆమె కళ్ళబడకుండా జాగ్రత్తపడ్డాడు. మహాదేవుడు, శివశంకరం ఆమె ననుసరిస్తూంటే కాస్త దూరంలో అతనూ వాళ్ళ ననుసరించసాగాడు.

శివశంకరం టేపు ఆన్ చేశాడు. ఆంజనేయదండకం ప్రారంభమయింది. అది జలజకు వినబడే స్థాయిలోనే వున్నది.

జలజ నడక వేగం పెంచింది. శివశంకరం, మహాదేవుడు కూడా వేగం పెంచారు.

ఉన్నట్లుండి జలజ పరుగెత్త సాగింది. శివశంకరం, మహాదేవుడు కూడా ఆమె వెనుక పరుగెత్తారు.

ఆమె తన కెదురైన టాక్సీ ఒకటి చటుక్కున ఆపి-తను అందులో కూర్చుంది. టాక్సీ తమను దాటుకుపోతూంటే శివశంకరం టేపురికార్డర్‌ను టాక్సీలోకి విసిరాడు.

కొద్ది సెకండ్లలో టాక్సీ ఆగింది. లింగం ఆ టాక్సీ ముందే వున్నాడు. జలజ టాక్సీ తలుపు తీసుకుని బైటకు పరుగెత్తింది. లింగం టాక్సీలోంచి టేపురికార్డర్ తీసుకుని ఆమె ననుసరించి పరుగెత్తాడు.

జలజ పరుగు ఆపింది. తనూ ఆగింది. లింగం తనను సమీపించేదాకా ఆగి—"సౌండ్ మరి కాస్త పెంచు—" అంది.

లింగం సౌండ్ పెంచాడు. జలజ అతడివంకే చూస్తూ నవ్వసాగింది. అదే నవ్వు. ఆమెకే ప్రత్యేకమయిన నవ్వు.

మహాదేవుడు, శివశంకరం కూడా ఆమెను సమీపించారు. విచిత్రమయిన ఆమె నవ్వు వినడం అదే మొదటిసారి వాళ్ళిద్దరకూ. టేపు రికార్డర్ ఆమెపై ఏ విధమయిన ప్రభావమూ చూపకపోవడం వాళ్ళకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

"కట్టేయ్ లింగం—" అన్నాడు శివశంకరం.

లింగం టేపు ఆఫ్ చేశాడు.

నవ్వాపి-"మీ భ్రమలోంచి మీరు బయటపడ్డారా?" అంది.

"భ్రమ ఏమిటి?" అన్నాడు మహాదేవుడు.

"దండకాలతో నన్ను జయించగలననుకోవడం?" అంది జలజ.

"నాది భ్రమకాదు. నీమీద దండకం పనిచేసింది. అందుకే నడివీధిలో పరుగులెత్తావు. కానీ తర్వాత ఏం జరిగిందో తెలియడంలేదు—" అన్నాడు శివశంకరం.

"ఈమె అన్న వినోద్ విషయంలోనూ ఇలాగే జరిగింది—ముందు బాధ నభినయించాడు. తర్వాత దండకం వింటూ హుషారెక్కిపోయాడు కూడా—" అన్నాడు మహాదేవుడు.

"అన్నయ్యకూ నాకూ కూడా ఓ విద్య తెలుసు. దానితో ఏ జ్ఞానేంద్రియాన్నైనా స్తంభింపజేయగలం. కాసేపు శబ్దగ్రహణాన్ని స్తంభింపజేశాను. అందుకే మీ దండకం నాకు వినిపించలేదు—" అని నవ్వి—"మీరు నా జోలికి రాకండి. అలాగే వకుళ గురించీ మర్చిపోండి. ఆమెను మీరేమీ చేయలేరు. ఏమయినా చేయాలనుకుంటే అది మీకే ప్రమాదమని గుర్తుంచుకోండి—" అంటూ అక్కడ్నించి వెళ్ళిపోయింది జలజ.

"వకుళను జయించడం అనుకున్నంత సులభంకాదు-" అన్నాడు శివశంకరం నిరుత్సాహంగా.

వెళ్ళిపోతున్న జలజవంకే చూస్తూ ముగ్గురూ అక్కడే చాలాసేపు నీరసంగా నిలబడిపోయారు.

34

రాత్రి పదిన్నరయింది.

అప్పుడే వీధులన్నీ నిర్మానుష్యంగా అయిపోతున్నాయి.

షణ్ముఖరావు, సూర్యావతి గాఢనిద్రలోకి అప్పుడే వెళ్ళిపోయారు.

సూర్యావతి పక్కనే పడుకున్న చంటిబాబు చటుక్కున లేచి కూర్చున్నాడు. ఒకసారి వంగి తలిదండ్రు

లిద్దర్నీ పరిశీలనగా చూశాడు. తర్వాత మంచం అంచు దాకా పాకి అక్కడ్నించి రెండు చేతులూ పట్టె చివర ఆధారంగా ఉంచి — వ్రేలాడుతూ మంచం దిగాడు. తలుపులు తీసుకుని వీధిలోకి వచ్చాడు. చకచక నడక ప్రారంభించాడు.

వాడు మనుషుల కంట బడకుండా జాగ్రత్తపడుతూ జోగారావు ఇంటికి వచ్చాడు.

వాడు గుమ్మం దగ్గరకు రాగానే గడియ దానంతటదే ఊడింది. తలుపులు వాటంతటవే తెరుచుకున్నాయి. వాడు చకచకా వంటింట్లోకి వెళ్ళాడు. అలమారాలో ఉన్న పెద్ద కత్తి తీసుకున్నాడు.

ఆ కత్తి వాడికంటె పొడుగ్గా వున్నది. అది కొబ్బరి కాయల కత్తిలా వుంది. చంటిబాబు దాన్ని అవలీలగా మోసుకుంటూ పిల్లలు పడుకునే గదిలోకి వెళ్లాడు.

అక్కడ రమ, సూర్యం పడుకుని వున్నారు.

చంటిబాబు వాళ్ళవంక పరీక్షగా చూశాడు. వాడి ముఖంలో క్రూరమయిన మందహాసం కనబడింది.

వాడు మంచమెక్కి కత్తిని గాలిలోకి ఎత్తాడు. మళ్ళీ క్రిందకు దింపాడు.

అలా రెండుసార్లు చేశాడు.

మొదటిసారి రమ తలకాయ, రెండోసారి సూర్యం తలకాయ మొండేలనుంచి వేరై నేలమీద పడ్డాయి.

చంటిబాబు కొద్దిక్షణాలు ఉత్సాహంగా మంచం మీద నృత్యం చేశాడు.

ఉత్సాహం అణగారేక వాడు మంచంమీంచి క్రింద కురికేడు. జోగారావు గదిలోకి నడిచాడు.

ఆ గదిలో జోగారావు, శారద నిద్రపోతున్నారు.

చంటిబాబు మంచం ఎక్కాడు. క్రూరంగా జోగారావువంక చూశాడు. కత్తిని గాలిలోకి లేపి, క్రిందకు దింపాడు.

ఒక్కసారిగా రక్తం చిమ్మి — శారద ముఖం తడిసింది.

చంటిబాబు కత్తిని దూరంగా విసిరి—నేలమీదకురికి క్రింద పడుకున్నాడు. వాడిప్పుడు మళ్ళీ చంటిపిల్లాడిలా, ఏమీ ఎరుగని అమాయకుడిలాగున్నాడు.

శారద ఉలిక్కిపడి నిద్రలేచింది. గదిలో వెలుతురు అంతగా లేదు.

ఏదో ఇనుప వస్తువు క్రిందపడ్డ శబ్దం ఆమె స్పష్టంగా విన్నది. ఆమెకు భయం వేసింది.

"ఏమండీ!" అన్నది.

జోగారావు మాట్లాడలేదు.

అప్పుడే శారద గుర్తించింది. తన ముఖంనిండా తడితడిగా జిగురుజిగురుగా ఉన్నదని. చీరకొంగుతో ముఖం తుడుచుకుని ఆమె భర్తను తట్టిలేపింది.

జోగారావు ఉలకలేదు, పలకలేదు.

"ఏమండీ—" అంది శారద భయంగా.

జోగారావునుంచి సమాధానం లేదు.

"మాట్లాడరేమండీ—నాకు భయం వేస్తోందండీ—" శారద కంఠంలో వణుకు ప్రారంభమయింది.

జోగారావు చలించలేదు.

ఇంక లాభంలేదనుకుని శారద తన రెండు చేతుల్తోటీ జోగారావు తలను పట్టుకుని కదిపింది. తల మొండెం నుండి విడివడి ఆమె చేతిలోకి వచ్చింది.

శారదకు జరిగిందేమిటో తెలుసుకోడానికి కొద్ది

క్షణాలు పట్టింది.

భర్త తల తన చేతిలో వుంది. మంచంమీద భర్త మొండెం మాత్రం ఉన్నది.

కెవ్వుమని కేక పెట్టింది శారద.

ఆమె కేక విని మాట్లాడ్డానికి అక్కడెవ్వరూ లేరు.

శారదకు స్పృహతప్పినట్లే అయింది కానీ తప్పలేదు. కానీ ఆమెకు మతిపోయినట్లుంది. తానెక్కడుందో ఏం జరుగుతోందో—అంతా అయోమయమయిపోయింది.

ఆమె నిశ్చేష్టురాలయింది. ఆమె చేతిలో భర్త తల ఇంకా అలాగే వుంది. ఆమె పక్కనే భర్త మొండెమూ వున్నది.

ఉన్నట్లుండి గదిలో దీపం వెలిగింది.

ఆ వెలురుకు శారద ఒక్కసారి కళ్ళు మూసి తెరిచింది. అప్పుడామె స్పష్టంగా అంతా చూసింది.

తన పక్కనే భర్త మొండెం—తన చేతుల్లో భర్త తల—మంచం నిండా రక్తం, తన చేతుల్నిండా రక్తం తన వళ్ళంతా రక్తం. శారద హడిలిపోయి పెద్దగా కేక పెట్టి చేతుల్లోని తలను దూరంగా విసిరేసి ఒక్కసారి కళ్ళు మూసుకుంది. మళ్ళీ భయపడుతూ భయపడుతూ కళ్ళు తెరిచి చూసింది.

తను విసరిన తల దూరంగా పడింది. ఆమె ఉలిక్కిపడింది.

ఆ తలకు పక్కగా సూర్యావతి కొడుకు పడుకున్నాడు.

అయితే ఇదంతా వాడి పనేనా?

భయం, ఆశ్చర్యం, కోపం, ఆవేశం—అన్నీ కలగలుపుగా వచ్చాయామెకు.

చంటిబాబు మాత్రం నిశ్చింతగా నిద్రపోతున్నట్లున్నాడు. వాడు బ్రతికే వున్నాడన్నందుకు సూచనగా పొట్ట పైకీ క్రిందికీ కదుల్తోంది.

శారద లేచి నిలబడింది.

అప్పుడే పడుకున్న చంటిబాబు కూడా లేచి నిలబడ్డాడు.

శారద మళ్ళీ కెవ్వుమని అరిచింది.

చంటిబాబు నాలు గడుగులు చేసి దూరాన వున్న కత్తితీసి చేత్తో పట్టుకున్నాడు.

శారద గుడ్లప్పగించి చూస్తోంది.

చంటిబాబు కత్తి తీసుకుని శారద మీదకు వస్తున్నాడు.

ఉన్నట్లుండి శారద గుమ్మం వైపు పరుగెత్తింది. ఐతే నాలుగడుగులయినా వేయకుండానే ఆమె ఆగిపోయింది.

గుమ్మంలో వకుళ నిలబడి ఉంది.

వకుళ ముఖంలో కోపం—కళ్ళల్లో క్రూరత్వం.

"పిన్నీ!" గుసగుసలాడుతున్నట్లుగా పిలుపు.

శారద వెర్రిమొహం వేసుకొని వకుళవైపే చూస్తూ ఉండిపోయింది.

"చంటిబాబు గురించి భయపడకు. నేను నిన్ను రక్షిస్తాను—" అంటూ ఆమె చేయి జాపింది. ఆ చేయి చంటిబాబు నందుకునేంతవరకూ సాగి వాడ్ని అందుకొంది. ఆ చేయి తనను తాకగానే చంటిబాబు చేతలోని కత్తిని అవతల పారేశాడు.

వకుళ వాడ్ని దగ్గరగా తెచ్చుకొంది. ఆమె చేయి మళ్ళీ యథాప్రకారం అయిపోయింది.

"నీ అక్కర్లేక లేకలేక పుట్టినవాడు నీడు. కానీ వీడ్ని

నేను వశపర్చుకొన్నా — ఎప్పుడో తెలుసా?" అంది వకుళ.

శారద ఉలుకూ పలుకూ లేకుండా వకుళ వంకే చూస్తోంది.

"ఈ ప్రపంచమంతా డబ్బులో వుంది పిన్నీ—అందుకే నేను డబ్బు సంపాదించాను. ఆ డబ్బుతో చాలామంది మనుష్యుల్ని కొనేశాను. అలాగే మంగమ్మనూ కొని ఈ వీధిలో ప్రవేశపెట్టాను. మంగమ్మ నాకోసం చాలా పనులు చేసిపెట్టింది. మధు ఇంట్లోని కంకాన్ని అదే మార్చేసింది. అందుకే మీ తాయెత్తులూ, కంకాలూ నా మీద పని చేయలేదు. అది ఒక రోజున చంటిబాబు నాడి మూండగా నేను వచ్చి వీడి రక్తం కొద్దిగా తాగి వీడిలో పిశాచత్వం ప్రవేశపెట్టి నీకు వ్యతిరేకంగా ప్రేరేపించాను. అప్పుడు వీడు కవ్వమని అరిస్తే ఊరుకోపెట్ట డానికి దారి తోచక మంగమ్మ పాలిచ్చినట్లు నటించింది. నే నక్కడ్నించి వెళ్ళిపోయాను. నేను మంగమ్మ రక్తం తాగలేదు కాబట్టి అది నాకు అన్నివిధాలా సహకరించ గలిగింది.... చంటిబాబు నా ప్రేరేపణలో నిన్ను చంప కుండా—శారీరకంగా, మానసికంగా ఎంతగానో హింసిం చాడు. ఈ రోజుతో ఆ కార్యక్రమం ముగిసింది—" అంటూ వకుళ చంటిబాబు చేతిని నాకడం మొదలు పెట్టింది. అలా భుజాలవరకూ నాకి చటుక్కున అక్కడ కొరికిందామె.

భయంకరమైన ఆ దృశ్యాన్ని శారద గుడ్లప్పగించి చూస్తోంది. కొద్దిసేపట్లో వకుళ చంటిబాబును అవతలకు విసిరేసింది. వాడు సరిగ్గా జోగారావు తల పక్కనే పడ్డాడు—నిర్జీవంగా.

"నిన్ను నేను చంటిబాబు బారినుంచి ఎందుకు తప్పించానో తెలుసా?" అంది వకుళ.

శారద మాట్లాడడంలేదు. వణికిపోతోంది. ఇప్పుడు భయం ఆమె శరీరాన్ని పూర్తిగా కమ్మేసింది.

"నిన్ను నేను చంపే క్షణం ఇప్పుడే వచ్చింది. నా పగంతా నీమీద. బ్రతికున్నంతకాలం నీమీద పగ తీర్చుకోవాలన్న కసితోనే పెరిగాను. ఇప్పటికి నా పగ తీరింది. ఇంక నిన్ను చంపొచ్చు. నిన్ను నేను స్వయంగా చంపాలని అనుకున్నాను. అందుకే చంటిబాబు బారినుంచి తప్పించాను ..."

వకుళ మాటలు పూర్తి కాకుండానే శారద గదిలోంచి పరుగెత్తబోయింది. అయితే వకుళ తన చేతిని పొడుగ్గా చాపి ఆమెను ఒడిసి పట్టుకొన్నది. రెండో చేతిని చాపి కత్తిని అందుకొన్నది.

అప్పుడు వకుళ తన చేతుల్ని ఇంకా పొడుగు చేసి శారదను బాగా వెనక్కి నెట్టింది.

అప్పుడు వకుళ గది గుమ్మం దగ్గర వున్నది. శారద ఎదురుగా ఉన్న గోడ దగ్గర ఉన్నది.

"క్షణాలు లెక్కపెట్టుకో—నీకు మృత్యువు గడియలు దగ్గరపడుతున్నాయి—" అంది వకుళ.

శారద అతి కష్టం మీద గొంతు పెగిల్చి—"నన్ను వదిలిపెట్టు...." అంది

"ఇంకా నీకు జీవితం మీద ఆశ ఉందా? లోపల భర్త మరణించాడు. అవతల గదిలో పిల్లలిద్దరూ చచ్చిపడున్నారు. అన్నట్లు మరిచేపోయాను. వాళ్ళను నువ్వు చూడనేలేదు కదూ?" అని ఆగింది వకుళ.

అప్పుడు శారదకు తన పిల్లలు గుర్తుకొచ్చారు. హఠా

తుగా ఆమెలో మాతృప్రేమ పెల్లుబికి భయం స్థానాన్ని ఆత్రుత ఆక్రమించి—"ఎక్కడ నా పిల్లలు?" అందామె.

"తొందరపడకు. వాళ్ళను చూశాకనే చద్దువుగాని" అంది వకుళ.

వకుళ చేయి ఆమెను పట్టుకొనే గాలిలోకి లేచింది. ఆమె చేయి అతి సులభంగా అటు తిరిగింది. అక్కడే నిలబడి వకుళ శారదను చేతితో పట్టుకొనే పిల్లల గది ముందుంచింది.

గదిలోని దృశ్యం చూసి శారద "రమా, సూర్యం" అంటూ గుండెలు బాదుకొని రోదించసాగింది. ఆమెను కాసేపలా ఏడ్వనిచ్చి మళ్ళీ గది గోడదగ్గరకు చేర్చి—"ఎలా ఉంది పిన్నీ నువ్వు చూసిన దృశ్యం?" అనడిగింది.

శారద ఇంకా ఏడుస్తూనే "ఎన్ని ఘోరాలు చేశావే పాపిష్టిదానా?" అంది.

"ఘోరాలే చేశాను పిన్నీ-కానీ ఎందుకో తెలుసా?" అంది వకుళ.

"నీకు కారణాలు కూడా ఉంటాయా?" అంది శారద.

"ఆఁ-నీకంటే మంచి కారణాలే ఉంటాయి నాకు. చిన్నతనం నుంచీ చచ్చేదాకా ఒక్క క్షణం కూడా మనిషిలా చూడలేదు గదా నువ్వు-అందుకేమయినా కారణాలున్నాయా?" అంది వకుళ.

శారద మాట్లాడలేదు.

"నీ పిల్లలకు బట్టలు కొని ఆ ఎన్నిక నా చేత చేయించావు. ఇంట్లో వున్నంతసేపూ స్కూలు పుస్తకాలు దాచేసి బళ్ళో నాకు చెడ్డ పేరు తెప్పించావు. చిన్నపిల్లనని జాలి లేకుండా నా చేత ఇంటెడు చాకిరీ చేయించావు.

నాన్న చేత నన్ను కొట్టించావు. అందరికీ నా గురించి చెడ్డగా ప్రచారం చేశావు. నీ పిల్లల ముందు నన్ను పని మనిషిని చేశావు. పరాయి మగాళ్ళకు నన్ను లోకువ చేశావు. నామీద రౌడీలు అమానుషం చేయడానికి ఉసి గొల్పావు. స్పృహ తెలియకుండా నేనుంటే నన్ను దిక్కులేకుండా వదిలేసి నీ అక్క కొడుకు బారసాలకు వెళ్ళావు. అందుకే అందరిమీదా పగ తీర్చుకున్నాను. నా మీద అవకాశం తీసుకున్న మధు ఇప్పుడు జీవచ్ఛవ మయ్యాడు. నీ కుటుంబం సర్వనాశనమైంది. నీ అక్క కొడుకు నిన్నొడిపించి మరీ చచ్చాడు. ఇంక నువ్వు మిగి లావు. నీ పని కూడా పూర్తిచేసి ఈ ప్రపంచం మీద పడతాను. నీ పని పూర్తిచేస్తేగానీ నేనింక దేనిమీదా దృష్టి పెట్టలేకపోతున్నాను. కాచుకో నా దెబ్బ—” అని ఆగింది వకుళ.

శారద పరిస్థితి మరోసారి చూసింది.

వకుళ గది గుమ్మం వద్ద వుంది. ఆమె రెండు చేతులూ ఎదుటి గోడను తాకేటంత పెద్దవిగా వున్నాయి. ఒక చేయి తనను ఒడిసి పట్టుకుంది. రెండో చేతిలో రక్తసిక్తమైన కత్తి వుంది.

గదిలో జోగారావు శవం. మొండెమొకచోట-తల ఒకచోట! సూర్యావతి బిడ్డ శవం. పక్క గదిలో తలలు వేరైన తన బిడ్డల శవాలు. కొద్దిసేపట్లో తనూ శవంగా మారనుంది.

శారద వకుళవంక చూసింది. ఆ కళ్ళు అగ్నిగోళాల్లా మండుతున్నాయి.

అప్పుడు శారద అన్నీ మరిచిపోయింది. ఆమెను ప్రాణభయం ఆవహించింది—“నన్ను వదిలిపెట్టు నీ

తృప్తికోసం ఏం చేయమంటే అది చేస్తాను....”
అందామె.

వకుళ క్రూరంగా పగలబడి నవ్వింది. ఈ నవ్వు ఇంకోరకంగా భయంకరంగా వుంది.

“ఇంత జరిగాక కూడా ఇంకా నీకు బ్రతకాలని వుందా? నీలాంటివాళ్ళను బ్రతకనివ్వకూడదు” అంటూ ఆమె శారదను సమీపించసాగింది. ఆమె శారదను సమీపిస్తూంటే ఆమె చేతులు ఒరలోకి పోతున్నట్లుగా క్రమంగా చిన్నవై పోయాయి.

వకుళ శారదకు బాగా దగ్గరకు వచ్చి కత్తివున్న చేతిని గాలిలోకి లేపింది.

శారద చావుకేక పెట్టింది.

ఆ కేకకు తెరచుకొన్న నోరలా వుండగానే శారద తల మొండెం నుంచి విడివడి దూరంగా జోగారావు తల పక్కనే పడింది.

వకుళ కత్తిని దూరంగా విసిరేసి గదిలో వికటాట్ట హాసం చేసింది. అంతులేని ఆనందంతో ఆ గదిలో ఆమె చాలాసేపు నాట్యం చేసింది. తరువాత ఆమె ఆ యింట్లో వున్న నాలుగు మొండేలనూ హాల్లో గోడకు తల క్రిందులుగా చేరగిల వేసింది. నాలుగు తలలనూ ఆ యా మొండేల కాళ్ళపై వుంచింది.

చంటిబాబు శవాన్ని ఆ నలుగురిముందూ పడుకో బెట్టింది.

అక్కడి ఆ దృశ్యాన్ని చూస్తూ ఆమె ఆగకుండా ఆవేశపనిగా నవ్వసాగింది. నవ్వుతున్నకొద్దీ ఆమెలో పిచ్చి ఆనందం పెరిగిందో ఏమో-వుత్సాహంగా నాట్యం చేయ సాగింది.

అది నాట్యంలా కాక విలయతాండవంలా వున్నది.

ఆమె నాట్యం అలా కొనసాగుతూండగా వీధి తలుపులు తెరుచుకున్నాయి.

వకుళ ఆ చప్పుడు వినలేదు. ఆమె వుత్సాహంగా నాట్యం చేస్తోంది.

“శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం ప్రభాదివ్యతేజం భజే కీర్తి కాయం....” అంటూ హెచ్చు స్వరంతో చక్కటి ఉచ్చారణతో ఆంజనేయదండకం వినబడసాగింది.

వకుళ నాట్యం ఆగిపోయింది. ఆమె చుట్టూ చూసింది. ఎవరూ కనబడలేదు. కానీ ఆమె శరీరంలో బాధ ప్రారంభమైంది. ఆమె అసహనంగా అటూ యిటూ కదిలింది.

దండకం స్థాయి పెరిగింది.

వకుళకు కాసేపు బుద్ధి పనిచేయలేదు. ఎదుర్కోలేని ఆపద తటస్థపడినట్లుగా ఆమె వణికిపోతూ అటూ యిటూ పరుగులు పెట్టసాగింది. ఆఖరికి ఆమె హాల్లో వున్న ఓ గుమ్మంలోంచి దొడ్డివైపుగా పారిపోదామని ప్రయత్నించింది. అయితే గుమ్మం సమీపించగానే బ్రేకు వేసినట్లుగా ఆగిపోయిందామె. గుమ్మంలో ఏదో ఆకారం కనపడిందామెకు. దానిని చూడగానే అప్రయత్నంగానే కీచుమంటూ అరిచింది.

అక్కడ గుమ్మంలో గదాధారుడైన హనుమంతుడు నిలబడి వున్నాడు. ఆమె వైపు హనుమంతుడు గుడ్లురిమి చూస్తున్నాడు.

అవతల దండకం ఆగకుండా వినబడుతోంది. ఇవతల హనుమంతుడు.

వకుళ రెండో గుమ్మం—అనగా బోగారావు పడక గది వయిపు పరుగెత్తింది. అక్కడ్నించి వంటింట్లోకీ, అలా దొడ్లోకీ దారులున్నాయి.

వకుళ ఎక్కువగా ఆలోచించలేకపోతోంది. అగకుండా వినబడుతున్న ఆంజనేయ దండకం ఆమెకు మతి లేకుండా చేస్తోంది.

గుమ్మందాకా వెళ్ళిన వకుళ మళ్ళీ కీచుమంటూ అరిచింది. ఆ గుమ్మంలో కూడా గదాధరుడైన హనుమంతుడున్నాడు.

ఇప్పుడు ఆంజనేయ దండకం వీధిలోంచి రావడం ఆగిపోయింది. అందుకని ఆమె వీధి వైపు పరుగెత్తింది. అయితే అక్కడ ఆమెకు గదాధరుడైన మరో హనుమంతుడు ఎదురుపడ్డాడు.

వకుళ త్వరగా హాలు మధ్యకు వచ్చేసరికి ముగ్గురు హనుమంతులూ ఆమె చుట్టూ చేరి వలయాకారంలో తిరుగుతూ ఆంజనేయ స్తోత్రం చేయసాగారు.

"ఏమిటిదంతా?" తీవ్రంగా అరిచింది వకుళ.

"ఇది ఆంజనేయ చక్రం. దీనినుంచి నువ్వు బయట పడలేవు. నీ ఆట కట్టింది. మర్యాదగా లొంగిపో—" అన్నాడు ఒక హనుమంతుడు.

"నే నెందుకు లొంగిపోవాలి? లొంగి ఏం చేయాలి?" అంది వకుళ.

"నీలో సర్వశక్తులూ నశించాలి. నువ్వు మామూలు శవానివి కావాలి—" అన్నాడు ఇంకో హనుమంతుడు.

"అసాధ్యం—నాకు నాశనం లేదు. నేను అమర జీవిని-" అంది వకుళ.

"అయితే ఈ ఆంజనేయ చక్రంలో బంధింపబడి

అమరజీవిగా అనుభవించు" అన్నాడో హనుమంతుడు. వాళ్ళలా వలయాకారంగా తిరుగుతూ ఆమె చుట్టూ సుద్దతో వలయం గీస్తున్నారు.

వకుళ వారివంక నిస్సహాయంగా చూస్తూ అలా నిలబడిపోయింది.

ముగ్గురు హనుమంతులూ ఆంజనేయ స్తోత్రం ఆపేశారు. వలయం గీయడం కూడా పూర్తయింది. వారిలో ఒకడు "ఇంక ఇదే నీకు స్థానం" అన్నాడు.

"ఈ చక్రం శాశ్వతం కాదు. కానీ నేను శాశ్వతం. ఆ విషయం మరిచిపోకండి—" అంది వకుళ.

"ఈ చక్రాన్ని నేను శాశ్వతం చేయగలను. నువ్వు శాశ్వతమైతే మాత్రం ఏమి చేయగలవు? స్నానం లేక వెలుగును చూడలేవు. రక్తం లేక శక్తిని కోల్పోతావు. అప్పుడు నీవల్ల ప్రపంచానికి ప్రమాదముండదు-" అన్నాడో హనుమంతుడు.

"నేను ప్రపంచానికి ప్రమాదం తలపెట్టను. మీకు లోబడి వుంటాను. మీరు చెప్పినట్లే వింటాను. నన్ను బంధ విముక్తురాల్ని చేయండి" అంది వకుళ.

"దుష్టశక్తి ఉనికి ప్రపంచానికే ప్రమాదం. నువ్వు మాకు బానిసగా పడివుంటానన్నా సరే-నిన్ను మేము వదలిపెట్టము. నీ కీ చెర తప్పదు" అన్నాడో హనుమంతుడు.

"చెర .... నా జీవితమంతా చెరగానే గడిచింది. తనువు చాలించి అపూర్వశక్తులు సాధిస్తే ఇప్పుడూ చెర బ్రతుకే అయింది" అని నిట్టూర్చింది వకుళ.

ముగ్గురు హనుమంతులూ వలయం చూస్తూ చతికిలబడి "ఇంతగా నిట్టూర్చే నీ జీవితగాథ చెప్పు—" అన్నారు.

వకుళ క్లుప్తంగా వారికి తన కథ చెప్పింది. తర్వాత

"మీరు నన్ను గుర్తించి నా దగ్గర కెలా రాగలిగారు?" అంది.

ముగ్గురు హనుమంతులూ తమను తాము పరిచయం చేసుకొన్నారు. ప్రొఫెసర్ మహాదేవుడు, అతడి అన్న శివశంకరం, మహాదేవుడి అసిస్టెంటు లింగం!.... వారు తమ పరిశోధనల గురించిన వివరాలన్నీ చెప్పాక ఈ రోజు లింగం అద్దంలో నీ ప్రతిబింబం చూసి జలజ రూపంలో నువ్వు తిరుగుతున్నట్లు గుర్తించాడు. ఆ తర్వాత ఈ రోజంతా నీ యింటిముందు కాపలా కాశాం. రాత్రి పదిన్నరకు నువ్వు ఇల్లు వదలి బయటకు వచ్చావు. నిన్ననుసరించి కొంతదూరం వచ్చాం. తర్వాత నువ్వు మా కన్నుగప్పావు. అప్పుడు మేము ముగ్గురమూ ఆలోచించుకొని నువ్వు నీ పాత యింటికి వెళ్ళి వుండవచ్చునని ఊహించాము. ఈ వేషాల గురించి ముందే అనుకొన్నాము. ఆంజనేయ రూపం ఎదుట నుండగా నువ్వు నీ శక్తులు ప్రదర్శించలేవు. నీ యింటికి రాగానే మాకు నీ వికటాట్టహాసాలు వినబడుతున్నాయి. వెంటనే సిద్ధమయ్యాము. నిన్ను బంధించాము—" అన్నాడు మహాదేవుడు.

"మీరు నాకు పునర్జన్మ ప్రసాదించారు. అందువల్ల పితృసమానులు. నన్నిలా హింసించడం మీకు తగునా! నేనెలాగూ మీ జోలికి రానని మీకు తెలియదా?" అంది వకుళ.

"దుష్టశక్తికి నీ, నా భేదముండదని నీ ప్రవర్తనే చెప్పక చెబుతుంది. ఇంతకూ నాకు కొన్ని సందేహాలున్నాయి. వాటి నెలా సాధించావో చెప్పాలి?" అంటూ "మధు కట్టుకొన్న తాయెత్తు మహిమను నువ్వెలా అధిగమించావు?" అనడిగాడు మహాదేవుడు.

"మంగమ్మ అనే అందగత్తెను డబ్బిచ్చి లోబరచుకొన్నాను. నేను నా శక్తులతో అందర్నీ జయిస్తూంటే మంగమ్మ తన అందంతో మధు, రతన్‌లాల్ లాంటి వాళ్ళను మంత్రించి వాళ్ళ తాయెత్తులు మార్చేసింది. ఆమెకు నేను మానవాతీతురాలినని తెలియదు కానీ విచిత్ర వ్యక్తి ననుకొంది—" అంది వకుళ.

"జలజ రూపాన్నెలా ధరించావు?"

"కోరిన రూపాన్ని ధరించగల శక్తి నాకుంది. అడువారిపై నాకాసక్తి తక్కువ. అందువల్ల జలజ అన్న వినోద్‌ను లోబర్చుకొని అతని యింట నా స్థావరం పటిష్ఠం చేసుకున్నాను. అప్పుడప్పుడు జలజ రూపంలో బయట తిరిగేదాన్ని. అయితే ఒకసారి ఆమె నన్ను నా గదిలో చూసి ఆ సమాచారం అందరికీ అందజేయాలని బైటకు వెళ్ళింది. అప్పుడు వినోద్ నన్ను రక్షించాడు. మనుషులకు చల్లటి నా శరీర స్పర్శ తెలియకుండా శరీరానికి పల్చటి తొడుగు ధరించాను—కానీ అప్పట్నించీ జలజను ఓ గదిలో బంధించడం జరిగింది. ఆమె రూపంలో నేను మాత్రమే బైటతిరుగుతున్నాను—" అంది వకుళ.

"రాగిణిని నీ యజమానురాలిగా ఎందుకు ఎన్నుకన్నావు?"

"ఆమెలో మంచి ఆశయాలున్నాయి. దౌర్జన్యాలను, అక్రమాలను, అవినీతిని ఆమె సహించదు. బ్రతికున్నప్పుడు నాలో లోపించిన ధైర్యసాహసాలామెలో ఉండడం చూసి ఆమెను నా యజమానిగా నిర్ణయించుకున్నాను. అందుకే ముందుగా ఆమెచేత జగ్గూని శిక్షింపజేసి—ఆ తర్వాత ఆమె ప్రవర్తన ఎలా ఉంటుందో పరిశీలించాను. తను చేసిన పనికి ఆమె ఆశ్చర్యపడింది, సంతోషపడింది—

తప్పితే—భయపడలేదు. అందుకే ఆమె నాకు నచ్చింది. నా గురించి ఆమెకు తెలియగానే నన్నామె చక్కగా ఉపయోగించుకుంది. నాకెంతో మంచి పేరు కూడా వచ్చింది—" అంది వకుళ.

"ఇంతకీ నువ్వేం సాధించానని అనుకుంటున్నావ్?" అన్నాడు శివశంకరం.

"నన్ను శారీరకంగా, మానసికంగా హింసించిన వారందరిపైనా పగతీర్చుకున్నాను. ఇప్పుడు నాకెంతో తృప్తిగా వుంది. ఆ తృప్తి ఎలాంటిదో మీరూహించలేరు—" అంది వకుళ.

"ఇంకా ఏం సాధించాలనుకుంటున్నావ్?"

"తెలిసిగానీ, తెలియకగానీ సాటిమనిషికి అన్యాయం చేసే ప్రతి ఒక్క మనిషిని ఏరిపారేద్దామనుకుంటున్నాను. అన్యాయమంటే వాడిలిపోయే స్థితికి ఎదిగేలా మానవుల్ని తయారు చేయాలనుకుంటున్నాను—"

"అలాగైతే — ఇన్ని కోట్ల మానవుల్లో మచ్చుకొక్కడు మిగలడే!" అన్నాడు లింగం.

"ప్రతివాడూ సాటిమనిషికి అన్యాయం తలపెట్టేటప్పుడు—ఆ మానవజాతి ఉంటేనేం — ఊడితేనేం?" అంది వకుళ తీవ్రంగా.

మహాదేవుడు నిట్టూర్చి — "నువ్వు మేమనుకున్నంత దుర్మార్గురాలివికాదు—" అన్నాడు.

"మరి నన్ను వదిలిపెడతారా?" అంది వకుళ ఆశగా.

"పరిమితంగా పుచ్చుకుంటే బ్రాందీ అంత మంచిది లేదు. కానీ మనిషి దానికి బానిస అయి—జీవితాన్ని నాశనం చేసుకుంటున్నాడు. దుర్భేద్యమైన పర్వతాల్ని వశం చేసు

తోడడం కోసం డైనమైట్ కనిపెడితే — మనిషి దాన్ని దౌర్జన్యకాండకు వినియోగిస్తున్నాడు. అణువులోంచి అనంతమైన శక్తిని కనిపెడితే — మనిషి దాన్ని మారణకాండకు వినియోగించి ఈ సృష్టికే ముప్పు తీసుకు వస్తున్నాడు. అప్పటికి అవి అస్వతంత్ర శక్తులు. పేరుకో యజమానిని ఎన్నుకున్నా నువ్వు స్వతంత్ర శక్తివి. నీవలన ప్రపంచానికి ముప్పు తప్పదు. అందువల్ల నిన్ను వదిలిపెట్టే ప్రసక్తి లేనే లేదు—" అన్నాడు మహాదేవుడు.

వకుళ నీరసంగా ఆ చక్రం లోపల కూలబడింది.

"ఇలా ఎంతకాలం మనమీ మెకు కాపలా?" అన్నాడు లింగం విసుగ్గా.

"అలా దొడ్లోకి వెడదాం. మీకో రహస్యం చెప్పాలి—" అన్నాడు శివశంకరం.

ముగ్గురు హనుమంతులూ దొడ్లోకి వెళ్ళారు.

"ఈ మెనిలా ఎంతసేపని ఎక్కడ నిలబెడతాం? ఈ మెను శాశ్వతంగా బంధించే ఏర్పాటేదైనా చేయాలి? అందుకు మీరేదైనా ఉపాయం ఆలోచించండి—" అన్నాడు శివశంకరం.

"మేమేం చెప్పగలం? నువ్వే చెప్పాలి—" అన్నాడు మహాదేవుడు.

"ఆ శరీరానికి నాశనం లేదు. దానికి చలనం స్తంభించవచ్చు. శక్తి క్షీణించవచ్చు. కానీ నాశనం మాత్రం లేదు. అందువల్ల ఈ మెను శాశ్వతంగా బంధించడానికి నాకు ఒక్కటే దారి కనబడుతోంది. ఒక కొయ్యపెట్టెలో ఈ మెనుంచి — దానిచుట్టూ శాశ్వతంగా ఆంజనేయ చక్రం వేసి ఉంచుదాం—" అన్నాడు శివశంకరం.

"ఈ యింట్లో ఎన్నో హత్యలు జరిగాయి. వాటికి మనం సంజాయిషీ యివ్వకతప్పదు. ఈమె గురించిన రహస్యాలేమీ మనం దాచడానికి వీల్లేదు—" అన్నాడు లింగం.

"మన ప్రయోగం విషయం మాత్రం రహస్యంగా ఉంచకతప్పదు. ఎందుకంటే ప్రమాదకరమైన ప్రయోగం చేయడం మన తప్పు. అలాటి ప్రయోగం చేయగల శక్తి మనకున్నదని తెలియడం మరింత ప్రమాదకరం. ఈ రెండు కారణాలవల్లా వకుళ దుష్టశక్తి అన్న విషయం మాత్రం మనం అందరికీ తెలియనివ్వవచ్చు. ఆమె దుష్టశక్తిగా ఎలా మారిందీ అన్న విషయం మనమెవరికీ చెప్పవద్దు—" అన్నాడు మహాదేవుడు.

"అయితే ఇప్పుడేం చేయాలి?" అన్నాడు లింగం.

"నువ్వు వెళ్ళి పోలీసుల్ని పిల్చుకునిరా—" అన్నాడు మహాదేవుడు.

సరేనని బయల్దేరాడు లింగం.

"ఇదిగో—ఈ వేషంలో కాదు—ముందు వేషం మార్చుకో—" అన్నాడు మహాదేవుడు.

ఈలోగా ఇంటిముందు ఏదో జీపు ఆగిన శబ్దమైంది.

ముగ్గురూ హడావుడిగా హాల్లోకి వచ్చారు. బూట్లు టకటకలాడించుకుంటూ ఒక పోలీసు ఇన్స్పెక్టర్ నలుగురు కానిస్టేబుల్స్ వచ్చారు. వారి వెనుకనే షణ్ముఖరావు, సూర్యావతి వచ్చారు.

ఇన్స్పెక్టర్ ముగ్గురు హనుమంతుల్నీ చూసి ఉలిక్కిపడి చిరాగ్గా—"ఏమి టీ వేషాలు?" అనడిగాడు.

(సశేషం)